# బొమ్మనేదు

"మీ యబిమాన దియేటరు" ఓ రకంగా ఆ ఊరికి గుండెకాయలాటిది. ఆ సినిమాహాలు వల్లే ఊరు స్పందిస్తూంటుంది. టెంట్, ఇటుక గోడలు, సిమెంటు చెయ్యని ప్రహరీ, రేకుల షీట్లు- వెరసి "మీ అబిమాన్దియేటరు". సినిమా హాలుకి గేటు లేదు. ఆవరణలో ఒకప్పుడు తెల్లగా ఇప్పుడు ఎర్రగా ఉన్న ఇసుక గోడ మీద అటూ ఇటూ పెద్ద తడికల మీద సినిమా పోస్టర్లు.

సాయంకాలం చీకటి పడగానే హాలుకి ప్రాణం ఒస్తుంది. ('తొలాట 7 గం. మలాట 10.30 గం.') దేవుడి("గంటసాలోడిది") పాటతో మొదలై సినిమా మొదలయ్యే వరకూ పాటల హోరు వర్షంలా చుట్టుపక్కల పల్లెలకి వ్యాపిస్తుంది. సూర్రాజుగారు ఆహాలు కట్టించి మూడేళ్లయింది. రాజుగారి రెండో అబ్బాయి హైదరాబాదులో ఉంటాడు. అతని సలహా మీద రాజుగారు సినిమా హాలు కట్టించారు. ("మన్రాజుగారబ్బాయి రోజూ క్రిస్నగాడితో సోబన్ బాబుతో సేకండిత్తా దెరుగుదువా?") హాలుముందు హక్కు భుక్తాలైన నిర్దిష్ట ప్రదేశాల్లో సోడాబళ్లూ, చిన్నకిళ్లీ కొట్టూ 'అయిసులో పెట్టిన కర్రుకాయ', బఠానీలు, వేరుశెనక్కాయ జింగిడీలు వెలిశాయి. హాలు ఎదురుగా పాక టీస్టాలు రోడ్డు కవతలగాఎప్పుడూ నిండుగా ఉంటుంది. ఇంటర్వెల్‌లో 'టియాయ్' అమ్మడానికి మూడు క్లాసులకీ ముగ్గురు కుర్రాళ్లున్నారు. సాయంకాలం, రాత్రీ ఊళ్లో సినిమా పాటలు వినగానే టైము నిర్ణయించుకోవడం అలవాటయింది. సైరన్‌కి ప్రత్యామ్నాయంగా హాలుపాటలు పనికొస్తున్నాయి. మధ్యాహ్నాలు, అప్పుడు నడుస్తున్న సినిమా కథని వివరంగా నవరసాలతో ఆడవాళ్లు చర్చించుకోవడం, సినిమా తారల ప్రేమ, వైవాహిక గాథలు అటుకుల్లా చప్పరించుకోవడం అలవాటయిపోయింది. సినీ ఉపమానాలు, సామ్యాలు, ఉదాహరణలు ఆ ఊరి నుడికారంలో ప్రవేశించాయి. ("రవణీ మద్దెన స్రీదేవిలా నడుత్తోందేటే?")

సినిమా ఆ ఊరికి వెండి అంచు. హాలు కేంద్రంగా ఊరంతా సాయంకాలం రంగులరాట్నంలా తిరుగుతూంటుంది. పైగా అన్ని రకాలైన ప్రేమ వ్యవహారాలకీ హాలు మంచి సంకేత స్థలంగా మారిపోయింది. ఉదయం పదవుతోంది. హాలు ఎదుట హోటల్లో ఇద్దరు ముగ్గురు టీ తాగుతున్నారు. హాలు ఆవరణలో ఇసకలో కుర్రాళ్లు చెడుగుడు ఆడుతున్నారు. తడిక మీద సినిమా పోస్టర్లు సగందాకా చిరిగిపోయాయి. మిగిలిన సగంలో

హీరోయిన్ మెడ కింద ఎవరో రెండు పేడ ముద్దలు సూటిగానే విసిరేరు. బెంచీ చివర కూచుని హాలువేపు చూస్తూ బీడీ వెలిగించి అన్నాడు రాజు.

"ఈ లంజికొడుకులికి పన్లేదట్రా ఎంకట్రావ్?"

'ఎంకట్రావు' సమాధానంగా నవ్వి రెండు కాళ్లూ కుర్చీ మీద పెట్టుకూర్చున్నాడు.

'అప్పుడే కట్టేసేవిటీ కొట్టు?'

'లేబుద్దవడం లేదెహె, పిచ్చెక్కినట్టుంది'

'నిజవే. కలకల్లాడేది. ఆలూ మూతపడింది, మనకి బిజినెస్సూ అలాగే ఏడిసింది'

'తొలాట వరకు ఏదో పనుండేది. సైకిళ్ల పుణ్యం నాలుగు డబ్బులొచ్చేవి'

'డబ్బులికి డబ్బులొచ్చే వనుకో. అసలు రోజూ తీర్థం కింద ఉండేదనుకో. రేయ్. రాజు కోటీ అట్రా'

'ఛ. తిక్కొచ్చేత్తొందనుకో. ఇంటికెళ్లి తానం గట్టాచేసి ఒచ్చేవోణ్ని. రెండాట వరకూ ఇక్కడే ఏడిసే వోళ్లం గదా. కొత్త రికార్డు విని ఎంతకాలవైందో'

వెంకట్రావు నవ్వేడు మళ్లీ రాజ అడిగాడు.

'ఇంకీ ఆలు ఇంతేనంటావా?'

'ఏవో. మనకేం తెలుత్తంలేదు. సాలాసోట్ల హాల్లు మూతబడ్డాయంట'

'గొడవేటీ?'

'ఏమో'

'రాజుగారికేం తెగులు? ఎవడో మూసేత్తే మనకేటీ?మనూరు గొడవ మన్దే'

'అడిగే ఓడెవడు? ఆయన హాలు. ఆయనిష్టం'

సినిమాహాలు మూతపడి పదిరోజులు దాటింది. సాయంత్రాలు నిశ్శబ్దంగా గోధూళితో కలవరపడి చల్లారిపోతున్నాయి. తిరిగి తిరిగి పెద్ద రంగులరాట్నం ఆగిపోయింది. సూర్రాజు గారు హాలు ఎందుకు మూసేశారో ఎవరికీ తెలియలేదు. గ్రామ జీవితంలో ఓ చిన్న చప్పుదనం మాత్రం చోటుచేసుకుంది. మద్రాసు, హైదరాబాదు నగరాల్లో కొన్ని నెలలుగా వండిన సినిమాలన్నీ నిర్జీవంగా రేకు డబ్బాల్లో చచ్చినపాముల్లా పడున్నాయి. సినీ రంగుల ప్రపంచం అంతా అస్తవ్యవస్తం అయిపోయి తారలకు ఏసీ గదుల్లో చెమటలు పడుతున్నాయి.

రాజు బీడీ అవతల పారేశాడు. తువాల్తొ మొహం తుడుచుకుని "ఒత్తా వెంకట్రావ్" అంటూ బయలుదేరేడు. పదడుగులు వేసిం తరువాత జేబు తడిమి చూసుకుని రోడ్డు

దిగి పొలాలవేపు నడిచాడు. పొలాల అంచున దూరంగా పాతిపెట్టిన నల్లకుంచెల్లా ఉన్నాయి తాడిచెట్లు. వేగంగా గట్టుమీద నడుస్తూ మామిడితోటవేపు వెళ్లాడు రాజు. గుడిశ బయట నులకమంచం మీద కూచుని చుట్టకాలుస్తున్నాడు ఆదెయ్య. గంటన్నరసేపు అక్కడే ఉండిపోయాడు రాజు. మధ్యలో ఆదెయ్య మూడుసార్లు లేచి మూడు సీసాలు కల్లు తెచ్చిచ్చాడు. ఆదెయ్యకి డబ్బులిచ్చి మళ్లీ పొలాలకి అడ్డంపడి ఊరివేపు నడిచాడు రాజు. ఎండ చురచురమంటోంది. ఆకలి కూడా రాజుకుంది. అన్నింటికీ మించి ఎవరో ఒకర్ని బాదెయ్యాలని ఉంది రాజుకి. అందులోఆదెయ్యతో మాట్లాడిన తరువాత అతనికి కోసం ఎక్కువైంది. సైకిలు రిపేరు చేయించుకుని డబ్బులివ్వకుండా పోయినా అంత కోపం రాదు రాజుకి.

'నాకే గుబులుగా ఉందనుకో. చూసి చూసి ఆలుకి అగ్గెట్టేత్తే గొడవొదిలిపోద్ది. అదో సర్దాగా ఉండేదనుకో. పాట్లింటా కూకునే ఓణ్ని" అన్నాడు ఆదెయ్య. దాంతో మరో కాయ స్వీకరించాడు రాజు.

"ఇంకింతేనే?" అన్నాడు రాజు.

"మూసేత్తే ఇంకేటెహె, మిల్లో ఏదో పెడతారంట"

"పోనీ ఎదవకొడుకుల్ని"

ఇంటి సందు మలుపు తిరుగుతుండగా ఎవరో కుర్రాడు రాజు కాలికి సైకిలు తగిలించి పడిపోయాడు. చక్రాన్ని ఓ తాపు తన్ని అరిచాడు రాజు. 'కళ్లుగాని పోయాయేట్రా, ఎదవ నాటకాలు'

పెరట్లో గోలెంలో నీళ్లతో కాళ్లు కడిగి లోపలికొచ్చేడు రాజు. మిగిలిన బట్టలు రెండూ తాడు మీద ఆరేసిరాజుభార్య లోపలికి వచ్చింది. చాపేసుకుని పడుకున్నాడు రాజు.

"ఒంట్లోగాని బాగోలేదా?"

కోపంగా భార్యవేపు చూసి ఊరుకున్నాడు రాజు.

"కొట్టు కట్టేశావా?"

"ఎహె" అని విసుక్కుని కళ్లు మూసుకున్నాడు. ఆమెకేవీ అర్ధం కాలేదు. సామాన్యంగా సినిమాకబుర్లు చెప్తూ అన్నం తినడం అలవాటతనికి. సూదీ దారం తీసుకుని గడప దగ్గిర కూచుందామె. వెంకట్రావు హోటలుకి కొంచెం దూరంగా రాజుసైకిలు షాపుంది. చెక్కలతో చేసిన బంకు, రెండు బెంచీలు, సత్తు బేసినూ, సైకిలు పంపూ, విరిగిన నాలుగు సైకిలు గొలుసులూ వగైరా. మిల్లులో కూడా పనిచేస్తుంటాడతను.

సాయంకాలం కొట్టు కట్టేసి, చేతులు వెంకట్రావు హోటల్లో కడుక్కుని ఓ టీ తాగి, బీడీ వెలిగించి హాలు చుట్టూ రేగే రంగుల్లో సంరంభంలో లీనమై ఉంటూంటాడు. తరచుగా వెంట్రావుకి 'డబులు ఫోటో' ఎలా 'లాగుతారో' కూడా వివరంగా చెప్తుంటాడు. సిసినిమా కథల్ని సంక్షిప్తంగా వ్యాఖ్యాన సహితంగా చెప్తూ నెమరేసుకుంటాడు. మామూలుగా రెండుసార్లు చూసిం తరువాత మళ్లీ చూడాలనిపిస్తే 'గేటుకాడ' చెప్పిచూసొస్తూంటాడు. పదిరోజుల్నించీ రాజు దిన చర్య తలకిందులైపోయింది. అతని సాయంత్రాలు స్తబ్దుగా, ఊడ్చిన చేలల్లా అయిపోయాయి.

"అన్నంగానీ పెట్టేదుందా లేదా?" కళ్ళు తెరిచి భార్య వీపుతో అన్నాడు రాజు. వెంటనే లేచి ఆమె కంచంలో అన్నం, కూరా పెట్టి చాప పక్కన పెట్టింద. మంచినీళ్ల చెంబు తెచ్చి ఎదురుగా కూచుందామె. ఆమె వెనక గోడకి పెద్ద పాత సినిమా పోస్టరు అతికించి ఉంది. రాజు భార్య కాటుకతో హీరోయిన్‌కి మీసాలు పెట్టింది.

"ఏటిదీ?"

"ఒంకాయ కూర"

"కాత్తంత ఎండుగడ్డిగాని ఏసేవేటీ? చీచీ"

ఆమెకి ఏవనాలో తోచలేదు. కంచంవేపూ, భర్తవేపూ మార్చి మార్చి చూసింది. కూర ముక్క తీసుకుని నోట్లో వేసుకుంది.

"దీనికేటయింది?"

రాజుకి ఒళ్లు మండిపోయింది.

"నోరు ముయ్యి! తెలీట్లేదేటి?" వెంటనే కోపం వచ్చిందామెకి.

"ఓ గలాసు ఎక్కువ తాగేవేటీ పరగడుపున?"

"తాగొచ్చాననంటావా?" అరిచి గుక్కెడు నీళ్లు తాగి, ఓ బూతు మాట ఊతంతో ఆమె చెంప ఛెళ్లు మనిపించాడు. ఇంచుమించుగా వెనక్కి తూలి ఏడుపుతో ఆమే, కోపంతో రాజూ తిట్లని లంకించుకున్నారు.

విసురుగా బయటికి వెళ్లిపోయి మధ్యాహ్నం అంతా మిల్లు దగ్గిర ఉండిపోయాడు రాజు. కాసేపు వీధుల్లో తిరిగి చీకటి పడుతుండగా మళ్లీ తొటవేపు బయలుదేరాడు. దార్లో సైకిలు నడిపించుకుంటూ నూకరాజు ఆపేడు.

"కొట్టు తీయలేదా? ఓ సారొచ్చి పేచీగాని ఎయ్యగలవా?"

"లేదెహె"

మరో గంటసేపు తోటలో కూచున్నాడు రాజు. రెండు సీసాలు లోపల పోసి తేన్చి లేచాడతను. జేబు తడువుకుంటే బీడీలు లేవు. గట్టమ్మటే రోడ్డు మీదికి వెళ్లి కిళ్లీ కొట్టు దగ్గిర బీడీలు కొని ఒకటి వెలిగించాడు. బెంచీ మీద ఇద్దరు, ఎదురుగా ముగ్గురూ రాజు వచ్చేసరికి సినిమా హాలు గురించే మాట్లాడుతున్నారు. వింటూ నుంచున్నాడు రాజు. హాలు పేరెత్తగానే అతనికికోపం ఎక్కువైంది. హాలు మూతకి కారణాలు తర్కించుకుంటూ రాజు నడిగేడు ఒకతను.

"అంతేనంటావా"

"ఏమో. హాలు మూసిన ఎదవ కొడుకులికి తెలియాలి" బెంచీ ఎదురుగా నుంచుని మాట్లాడే ముగ్గురూ సూర్రాజుగారికి పాలేళ్లే.

రెండు నిముషాల్లో మాటా మాటా పెరిగిపోయింది. పిచ్చికోపంతో ఇష్టం వచ్చినట్టు మాటలు రువ్వుతున్నాడు రాజు. మొదట ఊరుకున్నా రాజు తిట్లన్నీ సూర్రాజు మీద పడ్డం సహించలేక "నోరుముయ్‌వో"తో మొదలుపెట్టి వాళ్లు బూతులతో నడిపిస్తున్నారు. కిళ్లీ కొట్టు సూర్నాయుడికి ఆపడం కష్టంగా ఉంది.

"ఊరుకోండ్రా! సినిమా ఆలు గొడవ మనకెందుకు?"

అయిదో నిమిషానికల్లాకొట్టుచుట్టూ గుంపు పోగైంది. ఆరో నిమిషానికి రాజు చెంపలు రెండ డప్పుల్లా ఛడామని మోగేయి. ముక్కు బద్దలైంది. ఒక విసురులో పడబోయి, తూలి కింద పడ్డాడు. రాజు నడ్డిమీద కాలితో ఒక తాపు తన్నేడు చిన్న పాలేరు. రెండు చేతులూ నేలమీద ఆన్చి తల విదిలిస్తూ ఏడుపుతో తడిసిన ఉక్రోషంతో సూర్రాజుగారి గురించీ, ఆయన వంశం గురించీ తన సొంత మాటలతో మళ్లీ ప్రారంభించాడు రాజు.

***(10.11.96. ఆంధ్రప్రభ డైలీ– అనుబంధంగా ప్రచురించిన రవళి ప్రత్యేక సంచిక)***

❖ ❖ ❖